

ఆగస్టు 15 లేదా 20న తాండవ నీరు విడుదల

- రైతుల సూచనను అంగీకరించిన అధికారులు
- కాలువల్లో పూడిక తీయించాలని కోరిన ఆయకట్టు రైతులు

- 7లో



నాతవరంలో తాండవ ఆయకట్టు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ అనురాధ

సమస్యలపై ఇప్పటికైనా దృష్టి సారించేనా?

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



- ఉమ్మడి జిల్లాలో అనేక సమస్యలు
- అధ్వానంగా రహదారులు
- ఐదేళ్లుగా సాగునీటి వనరుల నిర్వహణ పనులు నిల్
- పాఠశాలల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- సాధారణ ఎన్నికల తరువాత మొదటి సమావేశం
- కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి):

కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం మొట్టమొదటిసారిగా శనివారం జరగనున్నది. గత సమావేశం నాటికి ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇప్పుడు లేరు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ సీట్లు, 13 ఎమ్మెల్యే సీట్లను కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) కైవసం చేసుకుంది. అరకు ఎంపీ స్థానంతోపాటు పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న జడ్పీ తొలి సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. జడ్పీలో వైసీపీకి మెజారిటీ ఉండగా, ఇద్దరు ఎంపీలు, పది మంది ఎమ్మెల్యేలు కూటమి తరపున ఉన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో ఏ సమస్యనూ పట్టించుకోలేదు. ప్రధానంగా రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. మరో మూడు నెలల పాటు వర్షాకాలం కొనసాగనున్నందున రోడ్ల మరమ్మతులకు తక్షణం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ జడ్పీ సమావేశం తీర్మానం చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్లుగా కాలువలు, జలాశయాలు, గ్రోయిన్ల మరమ్మతులు ఊసే లేదు. చివరకు డ్యామ్‌ల నిర్వహణకు నిధులు లేవు. ఈ విషయంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు పెద్దగా చొరవ చూపలేదు. ఈ ఏడాది ఖరీఫ్ పనులు సజావుగా సాగాలంటే జలాశయాలకు సంబంధించిన కాల్వల్లో పూడికలు తీయడం, చిన్నపాటి మరమ్మతులు చేయడంపైనైనా దృష్టిసారించాలి.

అలాగే వర్షాకాలం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లాలో మైదానం ప్రధానంగా ఏజెన్సీలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతంతోపాటు పట్టణాల్లో వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకోవాలి. కాగా 'నాడు-నేడు' పేరుతో రెండు దశల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు ప్రారంభించిన గత ప్రభుత్వం గడచిన ఏడాది నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అనేకచోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటి పూర్తికి నిధులు తెచ్చుకోవలసి ఉంది. వర్షాలతో ఏజెన్సీలో పాఠశాలల భవనాలు దెబ్బతినడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టిన జల జీవన్ మిషన్ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగింది. వీటితో పాటు జిల్లాలో నెలకొని ఉన్న పలు సమస్యలపై జడ్పీ సమావేశంలో సభ్యులు చర్చించే అవకాశం ఉంది.



స్టేడియం స్థలంలో దుకాణంపై సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న టీపీవో వెంకటేశ్వరరావు

మినీ స్టేడియం ఆక్రమణపై అధికారులు సీరియస్

మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదులు

- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ తనిఖీ
- సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం
- సాయంత్రంలోగా తొలగించాలని టీపీవో ఆదేశం

నర్సీపట్నం, జూలై 26 :

పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఆక్రమణలపై మునిసిపల్ కమిషనర్ రవిబాబుకు చాలా ఫిర్యాదులు అందడంతో టీపీవో శుక్రవారం మినీ స్టేడియం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అయ్యప్పస్వామి గుడి పక్కన స్టేడియం స్థలం ఆక్రమించి పూజా సామగ్రి దుకాణం భారీగా ఏర్పాటు చేయడంపై సంబంధిత వ్యక్తిని నిలదీశారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి సాయంత్రంలోగా ఆక్రమణ తొలగించాలని సచివాలయ సిబ్బందికి టీపీవో ఆదేశాలు జారీ చేశారు. స్టేడియం ముందు మెయిన్ రోడ్డుని ఆనుకొని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఉండేది. గత ఏడాది రోడ్డు విస్తరణలో భాగంగా మునిసిపాలిటీ దుకాణాలు పడగొట్టి రోడ్డు విస్తరణ చేశారు. ఆ సమయంలో అందరి షాపులతో పాటే పూజా సామగ్రి వ్యాపారికి సంబంధించిన దుకాణం కూడా తీసేశారు. మిగిలిన వ్యాపారులు తాత్కాలికంగా తోపుడు బండ్లు వేసుకొని మెయిన్ రోడ్డులో వ్యాపారం చేసుకుంటున్నారు. పూజా సామగ్రి వ్యాపారి మాత్రం స్టేడియం లోపల తాత్కాలింగా పందిరి ఏర్పాటు చేసుకొని పూజా సామగ్రి విక్రయించుకునేవాడు. హైకోర్టు స్టేటస్ కో హెచ్చరిక బోర్డు పెట్టాడు. గురువారం షాపునకు చుట్టూ ఐరన్ చానల్స్ వెల్డింగ్ చేయించి, రేకులు వేసి పక్కా దుకాణం ఏర్పాటు చేసుకోవడంతో మునిసిపల్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కమిషనర్ ఆదేశాలతో స్టేడియంలో దుకాణం తక్షణమే తొలగించాలని టీపీవో ఆదేశించారు.

విద్యాశాఖలో కలకలం!

వైసీపీ ప్రభుత్వం చేసిన అడ్డగోలు బదిలీలు రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ
- జిల్లాలో నిలిచిన 85 మంది టీచర్ల బదిలీ
- ఎవరికీ చెప్పుకోలేక మథనపడుతున్న గురువులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాశాఖలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అనేక అక్రమాలపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం సిఫారుసుల ముసుగులో ఉపాధ్యాయులను ముడుపులు తీసుకొని అక్రమంగా బదిలీలు చేశారంటూ ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా నిబంధనలకు విరుద్ధంగా జరిపిన బదిలీలను రద్దు చేశారు. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా విద్యాశాఖలో కలకలం రేగుతోంది. 2024 ఫిబ్రవరి నుంచి 2024 మే వరకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు ప్రభుత్వ ఉత్తర్వులతో రద్దయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారులు ఎన్నికల ముందు హడావుడిగా జరిపిన బదిలీల్లో మూడు విడతల్లో సుమారు 150 మందికి పైగా ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల ఆధారంగా విశాఖ, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల నుంచి స్థాన చలనం కల్పించారు. రాజకీయ పలుకుబడి వున్న కొందరు ఉపాధ్యాయులు కావాల్సిన చోటుకు బదిలీలు చేయించుకోగలిగారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వులతో అనకాపల్లి జిల్లాకు చెందిన సుమారు 85 మంది ఉపాధ్యాయుల బదిలీలు రద్దయ్యాయి. ఈ బదిలీల్లో ప్రతి ఉపాధ్యాయుడి నుంచి రూ.2 లక్షల నుంచి స్థానాన్ని బట్టి రూ.3 లక్షలు అంతకు మించి కూడా వసూలు చేసినట్టు ప్రచారం జరిగింది. ఈ బదిలీల్లో అప్పట్లో విశాఖపట్నంలోని విద్యాశాఖలో కొందరు ఉద్యోగులతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మంత్రిగా ఉన్న ఒక నేతపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీలు జరపాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పెట్టేసింది. సిఫారుసుల బదిలీల ముసుగులో వసూళ్లకు తెగబడి అడ్డగోలుగా బదిలీల ప్రక్రియ కానిచ్చేసింది. సాధారణ బదిలీల్లో అయితే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని సిఫారసుల బదిలీల కోసం రూ.లక్షలు ముడుపులు చెల్లించిన ఉపాధ్యాయులు ఇప్పుడు బదిలీలు రద్దవడంతో లబోదిబోమంటున్నారు. సిఫారసులతో బదిలీలు రద్దవడంతో జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు గత ప్రభుత్వ పెద్దలకు ముడుపులు చెల్లించామని బయటకు చెప్పుకోలేక లోలోపల మథనపడుతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గత ఏడాది బదిలీ అయిన ఉపాధ్యాయుల బదిలీలను నిలిపేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ తెలిపారు. జిల్లకు బదిలీపై వచ్చిన, ఇతర జిల్లాకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఈమేరకు సమాచారం అందిచామని పేర్కొన్నారు.



అనకాపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయం

బదిలీలు కౌన్సెలింగ్ ద్వారానే జరగాలి



ఏ ప్రభుత్వమైనా బదిలీలు కౌన్సెలింగ్ నిర్వహించి మాత్రమే జరపాలి. రాజకీయ పలుకుబడి, అర్థబలం ఉన్నవారికి కావాల్సిన చోటుకు ప్రభుత్వం నేరుగా బదిలీలు చేయడం సరికాదు. అక్రమ బదిలీల వల్ల సాధారణ బదిలీలలో న్యాయంగా బదిలీ కోరుకోనే వారికి నష్టం జరుగుతుంది.

- గొంది చిన్నబ్బాయ్, యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఒలింపిక్స్‌లో తెలుగు తేజం

100 మీటర్ల హర్డిల్స్‌లో ఎర్రాజీ జ్యోతి



- ఈ ఈవెంట్‌కు భారత్ నుంచి అర్హత సాధించిన తొలి మహిళా అథ్లెట్‌గా రికార్డు
- ఆగస్టు 7న రౌండ్-1 పోటీలు
- పతకంపై క్రీడా వర్గాల్లో కోటి ఆశలు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 26:

ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన జ్యోతి వెలుగులు విరజిమ్మనుందా.. అంతర్జాతీయ యవనికపై పసిడి పతకంతో మెరుపులీననుందా..క్రీడా వర్గాల్లో ప్రస్తుతం ఇదే చర్చ జరుగుతోంది. వందమీటర్ల హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాయడాన్ని మంచినీళ్ల ప్రాయంలా చేసుకుని, పతకాలను కొల్లగొడుతున్న ఎర్రాజీ జ్యోతి ఒలింపిక్స్‌లోనూ అద్భుత ప్రతిభతో సత్తా చాటుతుందని, నగర ఖ్యాతిని విశ్వవీధిలో ఎగురవేస్తుందనే ఆశాభావంలో క్రీడా రంగం ఉంది.

పారిస్ ఒలింపిక్స్‌లో నగరానికి చెందిన అంతర్జాతీయ మెరుపు అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి పాల్గొనడం విశాఖ క్రీడా రంగానికి గర్వ కారణంగా నిలిచింది. 100 మీ. హర్డిల్స్‌లో రికార్డులు తిరగరాస్తున్న జ్యోతి విశ్వక్రీడల్లో పతకం వైపు పరుగు తీసేందుకు సన్నద్ధమవుతోంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో జిల్లాస్థాయి నుంచి ఆసియా క్రీడల వరకు తాను ప్రాతినిథ్యం వహించిన ప్రతి రేస్‌లో పతకం సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్న జ్యోతి ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్ రేస్ ఈవెంట్‌లో పరుగు తీయనున్న తొలి భారత్ మహిళా అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది. విశాఖ నుంచి నేరుగా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గానూ ప్రత్యేకతను సంతరించుకుంది.

పోర్టు స్కూల్ నుంచి పారిస్ వరకు

పోర్టు స్కూల్ గ్రౌండ్‌లో అథ్లెట్‌గా క్రీడా జీవితాన్ని ప్రారంభించిన జ్యోతి తాజాగా ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి చేరింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా సాధన కొనసాగించింది. జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి క్రీడా నిపుణులను ఆకట్టుకుంది. అక్కడి నుంచి గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శాప్ ఏర్పాటుచేసిన స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్‌లో చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నది. రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అకాడమీకి ఎంపికైన తర్వాత జ్యోతి పరుగు ప్రస్థానంలో చోటుచేసుకున్న మార్పులు ఆమె దశ, దిశను నిర్దేశించాయి. అనతికాలంలోనే 100 మీ. హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగి పతకమే లక్ష్యంగా ఆమె తీసిన పరుగుకు జాతీయ రికార్డులు దాసోహమయ్యాయి. అంతర్జాతీయ ట్రాక్‌అండ్‌ఫీల్డ్‌లో ఆసియా క్రీడల వరకు ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించి అత్యున్నత అథ్లెట్లలో ఒకరిగా ఎదిగి ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిథ్యం వహించే స్థాయికి చేరింది.

ఆగస్టు 7న రౌండ్-1 పోటీల్లో

ఆగస్టు 7న మహిళల 100 మీ. హర్డిల్స్‌లో రౌండ్-1 (హీట్స్) పోటీల్లో జ్యోతి పాల్గొననుంది. ఆగస్టు 8న జరిగే రిపిచేజ్ రేస్ (హీట్స్‌లో క్వాలిఫై కానివారిలో బెస్ట్ టైమింగ్ ఉన్న అథ్లెట్లకు మరో అవకాశంగా నిర్వహించేది) ఉంటుంది. ఆగస్టు 9న సెమీఫైనల్, 10న ఫైనల్ రేస్ జరగనుంది.

ఇంకా పరాయి పంచనే!

28 వార్డులకు 17 వార్డు సచివాలయాలు ఏర్పాటు

- సొంత భవనాలు లేక సిబ్బంది, ప్రజలకు ఇక్కట్లు
- అద్దె ఇళ్లలో ఐదు వార్డు సచివాలయాలు
- గ్రంథాలయంలోని గదిలో 12వ వార్డు సచివాలయం
- జిమ్ కోసం కేటాయించిన గదిలో 22, 23 వార్డు సచివాలయాలు
- నర్సీపట్నంలో వార్డు సచివాలయాల దుస్థితి

నర్సీపట్నం, జూలై 26:

నర్సీపట్నం మునిసిపాలిటీలో వార్డు సచివాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పథకాలు, పౌర సేవలు అందించడానికి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ప్రభుత్వం వాటికి సొంత భవనాలు పూర్తి స్థాయిలో నిర్మించలేదు. దీంతో సిబ్బంది, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 17 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. నాలుగేళ్లు గడిచినా వీటికి భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో మహిళా మండలి భవనాలు, క్రీడా భవనం, అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు.



రామారావుపేటలోని అద్దె ఇంట్లో ఉన్న 8, 9 వార్డు సచివాలయం



అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న 6, 7 వార్డులకు సంబంధించిన సచివాలయం

మునిసిపాలిటీలో బీసీ కాలనీలోని 1, 2, 3 వార్డు సచివాలయాలు నవనిర్మాణ సమితి వికాస్ భవనంలో నిర్వహిస్తుండగా, పాత సంతబయలు వాటర్‌ట్యాంక్ వద్ద ఒక గదిలో 4, 5 వార్డుల సచివాయం నిర్వహిస్తున్నారు. రామారావుపేట 6, 7 వార్డులు, కొత్తవీధి 8, 9 వార్డుల సచివాలయాలు ఇద్దె ఇళ్లలో నడుపుతున్నారు. పెదబొడ్డేపల్లిలోని పాత పంచాయతీ భవనంలో 10, 11 వార్డులు, 13, 14 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. పెదబొడ్డేపల్లి శ్రీరామ్‌నగర్ కాలనీలో గ్రంథాలయం

... మిగతా 8వ పేజీలో

ఖరీఫ్ కళ

వరి నాట్లు ఆరంభం

- వర్షాలకు నిండిన చెరువులు
- దమ్ములు పడుతున్న రైతులు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ

రావికమతం, జూలై 26:

అల్పపీడనం, వాయుగుండం వర్షాలతో మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,025 హెక్టార్లలో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వరినారు సిద్ధంగా ఉండడంతో గ్రామాలలో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. మండలంలోని మేడివాడ, రావికమతం, పెద్దిరాజు, మత్స్యపురం, గుమ్మాళ్లపాడుల్లోని చెరువుల్లో తాజాగా కురుస్తున్న వర్షాలకు పుష్కలంగా నీరు చేరింది. ఈ వర్షాలకు రైతులు దమ్ములు ప్రారంభించి వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతి ఏడాది కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని ఆగస్టు ఐదున ఆయకట్టు భూములకు విడుదల చేసేవారు. అయితే ఈ ఏడాది వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్ నుంచి నీటిని విడుదలకు ముందుగానే దమ్ములు పట్టి, వరి నాట్లు ప్రారంభించేశారు. కల్యాణపులోవ నీరు వదిలే అవసరం ఉండకపోవచ్చునని రైతులు అంటున్నారు. వర్షపు నీటితోనే చాలా వరకు దమ్ములు పూర్తి కావచ్చునని వారంటున్నారు. అయితే రిజర్వాయర్ ఆయకట్టు దిగువ భూముల్లో నాట్లుకు ఇంకా వరి ఆకులు ఎదగలేదని అక్కడ రైతులు దమ్ములు ప్రారంభించలేదు. రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉన్నందున ఎప్పుడైనా నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కల్యాణపులోవ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. ఇక వర్షాధారం, చెరువుల ఆధారమైన మేడివాడ, గర్నికం, రావికమతం, గుమ్మాళ్లపాడు, కొమిర, మత్స్యపురం, బుడ్డిబంద, కవ్వగుంట తదితర గ్రామాలలో రైతులు దమ్ములు చేసి వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.



కొమిర గ్రామంలో పొలాల్లో దమ్ము చేస్తున్న ట్రాక్టర్



మత్స్యపురంలోవరి నాట్లు వేస్తున్న మహిళ రైతులు

తాండవ కుడి కాలువకు గండి



- చమ్మచింత అక్విడెక్టు వద్ద కొట్టుకుపోయిన మట్టి
- పరిశీలించిన తాండవ డీఈఈ

- 7లో

దిక్సూచి DIKSUCHI

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.



అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.

విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-
ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.
ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!





రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్లనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. *ఆంధ్రజ్యోతి, (చెన్నై)*

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలబ్రిటీల కానుకల వర్షం...




ఆభరణాల సెట్
అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.



ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా
బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.




రూ.20 కోట్ల రోల్స్ రాయిస్
'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్
సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్
రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్ధు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యూయల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.

క్రైం... crime news

వివాహిత హత్య

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని హత్య చేసిన భర్త



మృతి చెందిన జానకి

చింతపల్లి, జూలై 26: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ తొర్రుంపాడు గ్రామంలో దారుణం చోటు చేసుకున్నది. వివాహేతర సంబంధానికి భార్య అడ్డుపడుతుందని భర్త ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె. రమేశ్, కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

లోతుగెడ్డ పంచాయతీ తొర్రుంపాడు గ్రామానికి చెందిన కొర్ర రవి కుమార్ పెదబరడ పంచాయతీ చింతలూరు గ్రామానికి చెందిన గెమ్మెల జానకి (22)ని ప్రేమించి 2021లో వివాహం చేసుకున్నాడు. దంపతులు ఇద్దరు తొర్రుంపాడు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. రవికుమార్‌కు ఆరు నెలల క్రితం పిసిరిమామిడి గ్రామానికి చెందిన ఓ యువతి పరిచయమైంది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. పాడేరులో ఇటీవల జరిగిన అమ్మవారి జాతరలో రవికుమార్, పిసిరిమామిడి గ్రామానికి చెందిన యువతి కలిసి తిరిగినట్టు భార్య జానకి తెలుసుకున్నది. దీంతో జాతర నుంచి గృహానికి వచ్చిన భర్తను భార్య జానకి నిలదీసింది. నాటి నుంచి వారి మధ్య రోజూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య అక్రమ సంబంధంపై మరలా గొడవ జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రవికుమార్ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తలగడతో శ్వాస ఆడకుండగా చేసి భార్యను హత్య చేశాడు. అనంతరం గృహంలో ఉరి వేసుకుని మరణించినట్టుగా చిత్రీకరించి ఆమె తల్లిదండ్రులకు సమాచారం పంపించాడు. మృతురాలు తల్లిదండ్రులు, బంధువులు సాయంత్రం తొర్రుంపాడు గ్రామానికి చేరుకుని జానకి మృతిపై రవికుమార్‌ను నిలదీశారు. దీంతో తాను అక్రమ సంబంధం పెట్టుకున్నట్టు జానకి గొడవ చేస్తున్నందున హత్యచేసినట్టు ఒప్పుకున్నాడు. మృతురాలు తండ్రి దాసు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలింపు చర్యలు చేపడుతున్నామని సీఐ రమేశ్, ఎస్ఐ రాజారావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

సబ్బవరం, జూలై 26: అనారోగ్యంతో ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివి. బోదివలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి అప్పలరాజుతో రాజేశ్వరి(34)కు 2009లో వివాహం జరిగింది. వీరికి పద్నాలుగేళ్ల సుస్మిత, పన్నెండేళ్ల ప్రవల్లిక కుమర్తెలు ఉన్నారు. రెండో కుమార్తె తల్లిగర్భంలో ఉన్నప్పుడు రాజేశ్వరి ప్రమాదవశాత్తు మేడపై నుంచి జారి పడింది. ఆ సమయంలో ఆమె వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. అయినప్పటికీ నొప్పి తగ్గలేదు. శస్త్ర చికిత్స చేయించాలని వైద్యులు చెప్పినా ఆర్థిక పరిస్థితుల కారణంగా చేయించలేదు. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి ఆమె వెన్నునొప్పితో బాధపడుతూ శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. వాంతులు చేసుకుంటుండగా చిన్న కుమార్తె చూసి తండ్రికి సమాచారం అందించింది. 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో రాజేశ్వరి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉరివేసుకుని మరో వివాహిత...

రాంబిల్లి, జూలై 26: మండలంలోని ఓ గ్రామంలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. చినపూడిలో గత ఆరు నెలలుగా కె.తేజేశ్వరి తన భర్తతో కలిసి నివాసం ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన భర్త విధులు ముగించుకుని ఇంటికి చేరేసరి తేజేశ్వరి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించిందన్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉందని సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 26: ఇక్కడి జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పొట్లపాటి మహంకాళి (27) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు వెళ్తుండగా, డైట్ కళాశాల జంక్షన్‌లో వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడన్నారు. వెంటనే అతనిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు పంపినట్టు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడన్నారు. మృతుడి భార్య నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరు లైన్లుగా అనకాపల్లి- రాజమండ్రి రహదారి

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన ఎంపీ సీఎం రమేశ్



మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రమేశ్

అనకాపల్లి, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ జయరామ్ గడ్కరీని న్యూఢిల్లీలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి రాజమండ్రి మధ్య ప్రస్తుతం ఉన్న రహదారిపై రద్దీ పెరగడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ రహదారిని ఆరు లైన్‌ల జాతీయ రహదారిగా నిర్మించాలని కోరారు. ఇందుకు సంబంధించి మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. దీంతోపాటు జిల్లాలో ఇతర రహదారుల అభివృద్ధి, కొత్తగా నిర్మాణాలపై మంత్రికి వివరించారు. వీటిపై మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని ఎంపీ సీఎం రమేశ్ ఇక్కడి విలేకరులకు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

సబ్‌జైలులో న్యాయ అవగాహన సదస్సు

చోడవరం, జూలై 26: పట్టణంలోని సబ్ జైలులో శుక్రవారం స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలు ప్రభుత్వం అందించే న్యాయసహకారం తదితర అంశాలను గురించి వివరించడంతో పాటు నేరాలకు దూరంగా ఉండి జీవితాలను చక్కదిద్దుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె సబ్ జైలులోని సౌకర్యాలపై ఖైదీలతో మాట్లాడి ఆరా తీశారు. ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి గణేష్, సిబ్బంది బాబూరావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలాస పాసింజర్ గమ్యం కుదింపు.. పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 26: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ సెక్షన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడుస్తున్న 07470, 07471 నంబర్లు గల మెము పాసింజర్ రైళ్లు ఈనెల 29, ఆగస్టు 1, 3వ తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు, పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కాగా, ఆగస్టు ఒకటన గంటన్నర భువనేశ్వర్- చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830), ఆగస్టు 3న పూరి- గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (22974), ఆగస్టు 3న భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (22879) రైళ్లు గంటన్నర ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు వివరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చమ్మచింత అక్విడెక్టు వద్ద కుడికాలువకు గండి

10 అడుగుల మేర తాండవకు కొట్టుకుపోయిన మట్టి

నాతవరం, జూలై 26: మండలంలోని చమ్మచింత అక్విడెక్టును తాండవ డీఈ పి.అనురాధ శుక్రవారం పరిశీలించారు. ఈ అక్విడెక్టు వద్ద కుడి కాలువ మట్టి పది అడుగుల మేర పక్కనే ఉన్న తాండవనదిలోకి కొట్టుకుపోవడం పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమస్యపై టీడీపీ నేతలు సమాచారం అందించడంతో డీఈ అనురాధ ఇక్కడకు వచ్చి పరిశీలించారు. దీనిపై మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి సమయంలో తాండవ నీరు విడుదల చేస్తే కాలువకు గండి పడే ప్రమాదం ఉందన్నారు. అక్విడెక్టు కుడి కాలువ మరమ్మతు చేపట్టేందుకు అయ్యే ఖర్చుపై ప్రతిపాదనలు రూపొందించాలని ఏఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, నర్సీపట్నం టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, మాజీ ఎంపీటీసీ కాశపు నూకరాజు, అపన విజయ్, డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మట్టి కొట్టుకుపోవడంతో ఏర్పడిన పది అడుగుల గొయ్యి



మట్టి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ అనురాధ

దేశ రక్షకులకు సెల్యూట్

- జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్య



కార్గిల్ అమరవీరుల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జూలై 26: దేశం కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని సైనికులకు సెల్యూట్ అంటూ పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తమ ప్రాణాలను, కుటుంబాన్ని పణంగా పెట్టి దేశం కోసం పోరాడుతున్న వారిని అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజ అభివృద్ధికి, శ్రేయస్సు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులంతా సంఘటితంగా ఉండాలని కోరారు. అంతకు ముందు కార్గిల్ అమరవీరులకు న్యాయవాదులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షురాలు రోజా తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న మురళీమోహన్ పట్నాయక్

టెక్నాలజీ ఆధారిత బోధనతో నైపుణ్యం

- జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్

కె.కోటపాడు, జూలై 26: ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా విద్యార్థులకు బోధించి సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్య అభివృద్ధి పెంపొందించవచ్చని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్ అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం స్కూళ్లలో డిజిటల్ వనరుల వినియోగంపై ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఏ.కోడూరు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ట్యాబ్‌ల వినియోగం, విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పాఠశాలలో గల అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలించి నిర్వహణ, విద్యార్థుల ప్రతిస్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 కె.సత్యనారాయణ, ఎంఈవో -2 డీవీడీ ప్రసాద్, డీఎస్‌వీఆర్‌వై నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్ బార్‌గా సంత పాకలు

- ఇబ్బంది పడుతున్న ఏటికొప్పాక మహిళలు
- పలు సందర్భాల్లో మందుబాబుల వీరంగం
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి



ఏటికొప్పాక సంత పాకలో ఉన్న మద్యం సీసాలు

ఎలమంచిలి, జూలై 26 : ఏటికొప్పాక వారపు సంతలో ఏర్పాటు చేసిన పాకలను మద్యం బాబులు ఓపెన్ బార్లుగా మార్చేశారు. దీంతో స్థానికులతో పాటు హస్తకళాకారుల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని ఏటికొప్పాకలో ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతుంది. పంచాయతీ అధికారుల అనుమతి మేరకు సంతలో దుకాణదారులు పాకలను వేసుకున్నారు. సంత రోజు మాత్రమే వ్యాపారులు వీటిని వినియోగిస్తారు. మిగిలిన రోజులన్నీ ఈ దుకాణాలు ఖాళీగా ఉంటాయి. వీటిని కొందరు మందుబాబులు బార్లుగా మార్చేశారు. ఈ దుకాణాల్లో పగలు, రాత్రి అని తేడా లేకుండా మద్యం సేవించి, సీసాలను పగులగొడుతున్నారు. అక్కడే మల, మూత్ర విసర్జన చేసేస్తున్నారు.చెంతనే హస్త కళాకారుల కాలనీ ఉండడంతో మద్యం బాబుల వికృత చేష్టలకు కాలనీలోని మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. మందుబాబులతో కాలనీ వాసులు గొడవ పడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. వారపు సంత నిర్వహణ కోసం ఏర్పాటు చేసుకున్న దుకాణాలను ఓపెన్ బార్లుగా వినియోగిస్తున్న మందుబాబుల ఆటలు కట్టడి చేయాలని కాలనీవాసులు పోలీసులను కోరుతున్నారు.

15 లేదా 20న తాండవ నీరు విడుదల

రైతుల సూచనను అంగీకరించిన తాండవ అధికారులు

కాలువల్లో పూడిక తీయించాలని కోరిన ఆయకట్టు రైతులు



ఆయకట్టు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ అనురాధ

నాతవరం, జూలై 26: రైతుల కోరిక మేరకు తాండవ నీరు ఆగస్టు 15 లేదా 20వ తేదీల్లో విడుదల చేస్తామని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు. ఖరీఫ్‌కు తాండవ నీరు విడుదలపై అనకాపల్లి, కాకినాడ జిల్లాల ఆయకట్టు రైతులతో శుక్రవారం స్థానిక తాండవ సెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 371 అడుగుల నీరు ఉందన్నారు. ఈ నీరు 52 వేల ఎకరాలకు 60 రోజులు సరిపోతుందన్నారు. అయితే రానున్న రోజుల్లో వర్షాలు ఉన్నందున్న తాండవలోకి మరింతగా నీరు చేరేందుకు అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు ఎప్పుడు నీరు విడుదల చేయమని చెబితే అప్పుడు విడుదల చేస్తామని డీఈఈ అనురాధ అన్నారు. దీంతో మెజారిటీ రైతులు ఆగస్టు 15 లేదా 20 తేదీల్లో సాగు నీరు విడుదల చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మొండికండి గ్రామానికి చెందిన రైతు శ్రీరంగస్వామి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి తాండవ కుడి, ఎడమ కాలువల్లో పూడిక తీయ్యలేదని, కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేయలేదని, దీనివల్ల చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదన్నారు. తక్షణమే కాలువల్లో పూడిక తీయాలని కోరారు. రాష్ట్ర పామ్‌ఆయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు మాట్లాడుతూ తాండవ కాలువల నిర్వహణ, తలుపుల మరమ్మతులకు గురయ్యాయన్నారు. మార్చి నెలలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఏప్రాంతాల్లో కాలువలు, తలుపులు దెబ్బతిన్నాయో తెలుసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాకినాడ జిల్లా కేతఈ చిన్నయ్యపాలెం మాజీ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ అధికారుల ద్వారా తాండవ కుడి, ఎడమ కాలువల్లో పేరుకుపోయిన తుప్పలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, ఎంపీపీ ఎస్.లక్ష్మణమూర్తి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు కె.అప్పలనర్స, తాండవ మాజీ ఛైర్మన్ పి.కొండబాబు, తాండవ ఏఈలు వినయ్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారం దిశగా...

- భూ వివాదంపై దేవదాయ శాఖా మంత్రి ఆనం అధ్యక్షతన అమరావతిలో విస్తృత స్థాయి సమావేశం



అమరావతిలో మంత్రితో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

సింహాచలం, జూలై 26: సింహాచల దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ వివాదం పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి నగరంలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లక్షలాది మందికి సంబంధించిన సమస్య పరిష్కారం కోసం నడుంబిగించింది.

పంచ గ్రామాల భూ సమస్యపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోని సమావేశ మందిరంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశం ఏర్పాటుచేసి, సమగ్రంగా చర్చించారు. ఆ వివరాలను దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ పత్రికలకు విడుదల చేశారు. రాష్ట్ర హైకోర్టులో 2019లో దాఖలైన వ్యాజ్యానికి లోబడి జీవో 229లో పేర్కొన్న రేట్ల ప్రకారం 12,149 నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులపై నివేదిక సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ క్రమబద్ధీకరణ వల్ల సింహాచలం దేవస్థానానికి కలిగే నష్టాన్ని భర్తీ చేయనున్నారు. సుమారు 421 ఎకరాలకు సమాన విలువ ఉండే విధంగా ప్రాథమికంగా గుర్తించిన 853.6 ఎకరాల బదలాయింపుతో పాటు అవసరాల నిమిత్తం రహదారికి అనుసంధానంగా ఉన్న మరికొంత భూమిని గుర్తించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి సత్వరం సమర్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీంధిర్ ప్రసాద్‌ను మంత్రి రామనారాయణరెడ్డి ఆదేశించారు. దాని ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతితో హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి కోర్టు నుంచి ఉత్తర్వులు పొంది కట్టడాలను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పీవీజీఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కేపీ రామచంద్రమోహన్, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా కనకదుర్గమ్మ



శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన కొత్తకోట శ్రీకనకదుర్గ

రావికమతం, జూలై 26 : ఈ ప్రాంతంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన కొత్తకోట శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శనివారం భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆషాడ మాసం శుక్రవారం పర్వదినం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి 40 రకాల పండ్లు, కాయ, ఆకు కూరలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది.

28న శాకంబరి అలంకరణలో నూకాంబిక దర్శనం



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూలై 26: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేపడుతున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి అలంకరణ నిమిత్తం కూరగాయలు ఇవ్వదలచిన దాతలు దేవస్థానానికి విచ్చేసి తగు రశీదు పొందాల్సిందిగా ఆయన కోరారు.

ప్రముఖ రంగస్థల నటుడు ఈశ్వరరావు కన్నుమూత



ఈశ్వరరావు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జూలై 26: ప్రముఖ రంగస్థల నటుడు మిర్తిపాటి ఈశ్వరరావు (75) అనకాపల్లి పట్టణ శివారునున్న కొప్పాకలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం కన్నుమూశారు. ఈయన తన 15వ ఏట నుంచి నాటకాల్లో నటించడం మొదలు పెట్టారు. అనేక నాటకాల్లో వివిధ పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఆరు దశాబ్దాలుగా నాటక రంగంలో ప్రసిద్ధి చెందిన ఈయన రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ కొప్పాక ఈశ్వరరావు అంటే అందరికీ సుపరిచితులు. ఈశ్వరరావు మృతి పట్ల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ కౌన్సిలర్ కె.ఎం.నాయుడు, డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, దాడి జయవీర్, దేవాదుల శివాజీ, పలువురు రంగస్థల కళాకారులు సంతాపం తెలిపారు.

కొళాయిల నుంచి కలుషిత నీరు

- స్థానికుల ఆందోళన



పట్టణంలో కొళాయిల నుంచి వస్తున్న కలుషిత నీరు

చోడవరం, జూలై 26: పట్టణంలోని పలు కాలనీల్లో రెండు రోజులుగా పంచాయతీ వీధి కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొళాయిల నుంచి వచ్చే నీరు నల్లరంగులో ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో పట్టణంలోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకులలో కలుషిత నీరు సరఫరా కావడంతో పంచాయతీ సిబ్బంది ట్యాంకులను పరిశుభ్రం చేశారు. అయినప్పటికీ మళ్లీ కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుండడం విమర్శలకు దారితీస్తున్నది. ఇలాంటి నీరు తాగితే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని, మరో పక్క కొళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో టోకరా

- నగరానికి చెందిన మెకానికల్ ఇంజనీర్ నుంచి రూ.28 లక్షలు గుంజిన హైదరాబాద్ ముఠా

ఎండాడ (విశాఖపట్నం), జూలై 26: ఆన్‌లైన్‌లో డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పెళ్లి కాని యువకులను పరిచయం చేసుకుని, వారి నుంచి డబ్బులు గుంజుతున్న మోసగాడిని విశాఖపట్నం సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ స్టేషన్ సీఐ కె.భవానీప్రసాద్ అందించిన వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన కొమ్మగోని లోకేష్ డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పలువురికి అమ్మాయిగా పరిచయం అవుతాడు. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసి అందులో కొంతకాలం చాట్ చేస్తాడు. అందమైన అమ్మాయిల ఫొటో పంపి దగ్గరైనట్టు మెసేజ్‌లు పెడతాడు. ఆ తరువాత అత్యవసరమంటూ డబ్బులు గుంజుతాడు. ఈ విధంగా నగరానికి చెందిన అవివాహితుడైన మెకానికల్ ఇంజనీర్‌కు వల వేశాడు. దఫదఫాలుగా రూ.28 లక్షలు రాబట్టుకున్నాడు. తాను మోసపోయానని గుర్తించిన మెకానికల్ ఇంజనీర్ నగరంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సాంకేతికతను వినియోగించి నిందితుడు హైదరాబాద్‌కు చెందిన లోకేష్‌గా గుర్తించి అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో అతనికి సహకారించిన హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు నిందితులు ఆర్.సాయి ధీరజ్, షాలినీ పరారీలో ఉన్నారు. వారిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

1500 హెక్టార్లలో పామాయిల్ సాగు విస్తరణ

▸▸ అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకర్



మల్లవరంలో పామాయిల్ మొక్కలను పరిశీలిస్తున్న ప్రభాకర్

అచ్యుతాపురం రూరల్, జూలై 26 : ప్రభుత్వం చేపట్టిన పామాయిల్ మెగా మేళాలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1500 హెక్టార్లలో పామాయిల్ తోటలను వృద్ధి చేయనున్నట్టు జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని మల్లవరం, నరేంద్రపురం గ్రామాల్లో శుక్రవారం పామాయిల్, బొప్పాయి తోటల సాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు రైతులతో మాట్లాడి సాగుపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పామాయిల్ విదేశీ దిగుమతులను నియంత్రించేందుకు ప్రభుత్వం రైతులను ఈ సాగు దిశగా ప్రోత్సాహిస్తున్నట్టు చెప్పారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదిహేను వందల హెక్టార్లలో కొత్త మొక్కలను నాటే ప్రక్రియ ప్రారంభించినట్టు చెప్పారు. సెప్టెంబరు పదోతేదీ నాటికి శతశాతం పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. పామాయిల్ తోటలను పండించాలని ఆశించే రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తుందన్నారు. మొక్కల కోసం హెక్టార్‌కు రూ.29 వేలు, ఎరువుల కోసం రూ.21 వేలు, అంతర పంటలు పండించుకోవడానికి మరో రూ.21 వేలు, బిందు సేద్యం కోసం రూ.25 వేల రాయితీ వంటివి అందిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట మండల ఉద్యానవన శాఖాధికారిణి సాయిప్రియ, హార్టీకల్చర్ అసిస్టెంట్ లోకేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో డీపీవో పర్యటన

▸▸ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ఆరా



ట్యాంకు పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకుంటున్న శిరీషారాణి

ఎస్.రాయవరం, జూలై 26 : జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని వాకపాడు పంచాయతీ బంగారమ్మపాలెంలో చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణం పనులు నిలిచిపోవడంపై డీపీవో శిరీషారాణి శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కృష్ణారెడ్డితో వెళ్లి పరిశీలించారు. ట్యాంకు నిర్మాణ పనులు ఆగిపోవడానికి గల కారణాలపై ఆమె సంబంధిత అధికారుల నుంచి ఆరా తీశారు. అలాగే ప్రత్యమ్నాయంగా ట్యాంకు నిర్మాణానికి గల స్థలం గురించి రెవెన్యూ అధికారులతో చర్చించారు. అక్కడి నుంచి తిరిగి వెళుతుండగా బంగారమ్మపాలెం, కొత్త రేవుపోలవరం, గుడివాడ గ్రామాల వద్ద ప్రధాన రహదారి పక్కనే చెత్త డంపింగ్ యార్డులను తలపించేలా ఉండడాన్ని చూశారు. గ్రామాల్లో చెత్త సమస్య లేకుండా చూడాలని ఎండీవో సత్యనారాయణమూర్తి ఈవోపీఆర్‌డీ సత్యనారాయణలకు సూచించారు.

'గ్రామాల్లో పక్కాగా పారిశుధ్య పనులు'



బీకేపల్లిలో పిచ్చిమొక్కల తొలగింపును పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

కోటవురట్ల, జూలై 26 : మండలంలోని పాములవాక, తంగేడు, బీకేపల్లిగ్రామాల్లో పారిశుధ్య పనులను నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఆగస్టు పదోతేదీ వరకు పారిశుధ్య పనులు చేపట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రక్షిత మంచినీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలని, గ్రామాల్లో రోడ్లకు ఇరుపక్కలా ఉండే జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సిబ్బందికి ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

▸▸ సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బందికి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బాలాజీ సూచన



పీహెచ్‌సీకి వచ్చిన వారికి సూచనలు ఇస్తున్న బాలాజీ

ఎస్.రాయవరం, జూలై 26 : మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో గల పీహెచ్‌సీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎంఎస్ వీకే బాలాజీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ, డాక్టర్ ఎన్.వాసంతిలకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు, స్టాప్ డయేరియా వంటి కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం లెప్రసీ అనుమానిత మచ్చలు ఉన్న వ్యక్తిని ఆయన పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి టి.నాగేశ్వరరావు, హెల్త్ విజిటర్ వై.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పరాయి పంచనే!

... 5వ పేజీ తరువాయి

గదిలో 12వ వార్డు సచివాలయం, మెప్మా కార్యాలయంలో 15వ వార్డు సచివాలయం, శారదానగర్ అద్దె ఇంట్లో 16వ వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. బలిఘట్టం పాత పంచాయతీ భవనంలో 17, 18 వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా 19, 20వ వార్డు సచివాయం పాత బయపురెడ్డిపాలెంలోని అద్దె ఇంట్లో ఏర్పాటు చేశారు. 21వ వార్డు సచివాలయం శారదానగర్‌లోని అద్దె ఇంట్లో నడుస్తోంది. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారుల కోసం నిర్మించిన భవనంలో 22, 23 వార్డు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయంలో 24, 25, 26, 27 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఏరియా ఆస్పత్రి ఎదురుగా మహిళా మండలి భవనంలో 28వ వార్డు అయ్యన్నకాలనీ సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రైవేటు భవనాలలో సచివాలయాలు నిర్వహించడంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. అంతేకాదు ప్రజావసరాలకు సరిపడా భవనాలు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇక్కట్ల మధ్య విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఉన్న పది మంది ఉద్యోగులు ఒకే గదిలో పనిచేయాల్సి వస్తోంది. ప్రతి వార్డులో మునిసిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలు ఉన్నప్పటికి ప్రభుత్వం భవనాలను నిర్మించడం లేదు. దీంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సైనికులకు వందనం

▸▸ పలు మండలాల్లో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

▸▸ అమరవీరులకు అంజలి ▸▸ మాజీ సైనికులకు ఘన సత్కారం



యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు, జూలై 26 : కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అనకాపల్లి పట్టణంలోని యువమోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర సైనిక్ సెల్ కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు మాట్లాడారు. భారత దేశసైన్యం పాకిస్థాన్ సైన్యంపై విజయం సాధించడం వల్ల ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.అనంతరం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఎన్.ఈశ్వరరావు, శివశంకర్, ఆదిరాజు, సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, యువమోర్చ నాయకులు స్వరూప్, శివ, రాజు, ముత్యాలనాయుడు, జయంత్, లోకేశ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

నక్కపల్లిలో...

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లిలో బీజేపీ శ్రేణులు కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ముందుగా కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లుకు నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి హైవే వరకూ బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సైనికులను సత్కరించారు.కూటమి నాయకులు పాకలపాటి రవిరాజు, జోగినాయుడు, వెంకటరమణ, నానిబాబు, దేవవరపు లోవరాజు, నున్న నాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: వీరోచిత పోరాటంతో కార్గిల్ యుద్ధంలో గెలిచిన రోజు ప్రతి భారతీయుడు గర్వించాల్సిన రోజని సిఐ పిన్నింటి రమణ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం జంక్షన్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకూ నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. అంతకు ముందుకు బీజేపీ నాయకులు గొంప నర్సింగరావు, మండల కార్యదర్శి శ్రీనివాసవర్మ, రెడ్డి రామునాయుడులతో కలిసి కార్గిల్ యుద్ధంలో అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం మాజీ సైనికులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. అకాడమీ కరస్పాడెంట్ పోతల సత్యనారాయణ, సూర్యప్రకాశ్‌లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగుకు

అసెంబ్లీలో 'కొణతాల' సూచనలు



కొత్తూరు, జూలై 26 : రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు శుక్రవారం జరిగిన అసెంబ్లీలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పలు సూచనలు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గౌరవ సభ్యుల నుంచి సలహాలు, సూచనలు అందించాలన్న నేపథ్యంలో కొణతాల స్పం దించారు. సీఏజీ ఆడిట్ ఆవశ్యకతను, ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిధిలో ఉండాల్సిన అంశాలను ఆయన వివరించారు. అంతేకాకుండా దొంగ వ్యాపారాలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అంశాలపై దృష్టి సారించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ సీఏజీ రికార్డులు అందించకుండా, అసలు ఆడిట్ జరగకుండా గత ప్రభుత్వం అడ్డుపడిన అంశాలను సభ ముందుకు తీసుకువచ్చారు.

అనధికార నిర్మాణంపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ నరసింగరావుకు ఫిర్యాదు కాపీ అందిస్తున్న నాయకులు

రాంబిల్లి, జూలై 26 : వాడనరసాపురంలో అనధికారికంగా నిర్మిస్తున్న చర్చిని నిలుపుదల చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు సీఐ నరసింగరావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, చోడిపిల్లి ప్రసాద్, సూరాడ అప్పలరాజు, కోదండరావు, కొవిరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బుద్ద' జన్మదిన వేడుకలు



షిర్డీలో బుద్దకు చిత్రపటం అందిస్తున్న నారాయణరావు

అనకాపల్లి టౌన్, జూలై 26 : టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు తన జన్మదిన వేడుకలను షిర్డీలోని సాయిబాబా సన్నిధిలో శుక్రవారం జరుపుకున్నారు. ముందుగా బాబాను దర్శించుకున్న ఆయనకు పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీరిద్దరితో పాటు పెనుమత్స సతీష్ వర్మ త్రయంబకేశ్వరం వెళ్లారు.

తుమ్మపాల : మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం అనకాపల్లిలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయనక కుమారుడు నూకేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు



పార్టీ కార్యాలయంలో జన్మదిన కేకు కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

జన్మదిన కేకును కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల సత్యనారాయణ, మాదంశెట్టి నీలబాబు, బొడ్డేడ మురళీ, శంకర్ల పద్మలత, మళ్ల గణేష్, మళ్ల శివన్నారాయణ, బోడి వెంకటరావు, ధనాల విష్ణుచౌదరి పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

కశింకోట, జూలై 26 : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం సందర్శించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా నిర్వహించిన సాంకేతిక నైపుణ్య దినోత్సవంలో విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక విద్య గురించి, వారికి ఇచ్చిన కిట్లు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఐఎఫ్‌పీ బోర్డును ఉపయోగించి నేర్పుతున్న పాఠాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సైన్స్ ల్యాబ్ పరికరాలు, ఒకేషనల్ ట్రేడ్‌లో అప్పరల్ డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలించడంతో పాటు పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయిని స్వర్ణకుమారి, డీఎస్‌వో డి.కాళిదాసు, పీడీ పెంటకోట సుజాత తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి'



సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీవో మనోహర్

కశింకోట, జూలై 26 : రోడ్డు భద్రతపై విద్యార్థులంతా అవగాహన పెంచుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ సూచించారు. కన్నూరుపాలెంలో ఉన్న ప్రైమరీ, హైస్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రధానంగా మైనర్ బాలబాలికలు వాహనాలు నడపరాదన్నారు. ఇది చట్ట విరుద్ధంగా పేర్కొన్నారు. అనంతరం వాహనాలు నడపడం వల్ల అనర్థాలనువివరించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.గోపీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.అన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ స్థల ఆక్రమణకు యత్నించినట్టు వైసీపీ నేతపై కేసు

పాయకరావుపేట, జూలై 26 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థల ఆక్రమణ వివాదానికి సంబంధించి పోలీసులు వైసీపీ నాయకుడిపై కేసు నమోదు చేశారు. స్థానిక పీహెచ్‌సీకి రక్షణ గోడ నిర్మాణం జరుగుతుండగా, పక్క స్థలం యజమాని తన స్థలం పీహెచ్‌సీలో ఉందని సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేయడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. విచారణ చేసిన తహసీల్దార్ సూర్యనారాయణ ఆసుపత్రి ప్రహరీ గోడ గతంలో ఉన్నట్టుగానే నిర్మాణం చేసుకోవాలని ఆదేశించారు. ఈక్రమంలో ఆసుపత్రి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాడని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు వైసీపీ నాయకుడు, మండలంలోని పీఎల్.పురం సర్పంచ్ పడాల సోమన్నదొరపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్ వద్ద హెచ్చరిక బోర్డు

అచ్యుతాపురం, జూలై 26 :పూడిమడకలో ఎటువంటి లేఅవుట్‌లకు అనుమతులు లేవని పంచాయతీ అధికారులు తెలిపారు. ఇక్కడ లేఅవుట్ వేయడంపై మత్స్యకార నాయకుడు ఎరిపల్లి కాసులు ఇటీవల కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది శుక్రవారం అనుమతి లేని లేఅవుట్ వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు.

బదిలీపై వెళుతున్న

తహసీల్దార్లకు ఘన సన్మానం



అచ్యుతాపురంలో తహసీల్దార్ సరోజిని సన్మానంలో కార్యాలయ సిబ్బంది

అచ్యుతాపురం, జూలై 26: ఇక్కడి నుంచి శ్రీకాకుళం బదిలీపై వెళుతున్న తహసీల్దార్ సరోజినిని కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల ముందు ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం మండలంలో విధులు చాలా క్లిష్టమైనవన్నారు. ఇన్నాళ్లూ తనకు సహకారం అందించిన డీటీ నీరజ, ఆర్ఐ సోమేష్‌కుమార్‌తో పాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో సురేష్ కుమార్, వీఆర్‌వోలు శశి, సింహాచలం నాయుడు, వెంకటరావు, సత్య, చినఅప్పారావు, మహేష్, సత్యం పాల్గొన్నారు.

నక్కపల్లి : ఇక్కడి తహసీల్దార్ శ్రీకాంత్‌కు బదిలీ కావడంతో కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో తహసీల్దార్ శ్రీకాంత్ ఎంతో అంకితభావంతో పనిచేశారని అభినందించారు. ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కన్నబాబు, సర్వేయర్ మూర్తి, వీఆర్వోలు దుశ్శాలువతో ఆయనను సత్కరించారు.



నక్కపల్లిలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు సన్మానం

'హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం'

ఎలమంచిలి, జూలై 26 : వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధి పాటిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అన్నారు. శుక్రవారం ఇక్కడి కోర్టు ఆవరణలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. వాహనాల డ్రైవింగ్ చిన్నపాటి తప్పిదం చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్లు, కారు వంటి వాహనాల్లో ప్రయాణించేవారు సీటు బెల్టులు ధరించాలని ఆమె సూచించారు. న్యాయవాదులు డి.వెంకట్రావు, కూనిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురైన సంఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతుండడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణాలు సాఫీగా సాగుతాయన్నారు. అనంతరం ఎస్‌బీఐ ప్రోత్సాహంతో సమకూర్చిన హెల్మెట్‌లను జడ్జి చేతుల మీదుగా పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ధూళి నూకరాజు, పీవీ రమణ, శ్రీనివాస పట్నాయక్, నాగేశ్వరరావు, కీర్తి కొండలరావు, వంశీ, సతీష్‌లతో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనచోదకులకు హెల్మెట్‌లు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు సత్కారం



శ్రీనివాసరావు, నానాజీలను సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 26 : మధ్యప్రదేశ్‌లో జరిగిన మాస్టర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన పట్టణానికి చెందిన ఎం.శ్రీనివాసరావును, కోచ్ వసాది నానాజీలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు నీలా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు విజేతను అభినందించారు. మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ అప్పారావు, అందే గణేష్, సోమునాయుడు, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే 'సుందరపు'



డీజీపీకి పూల మొక్క అందిస్తున్న సుందరపు

అచ్యుతాపురం/ఎలమంచిలి, జూలై 26 : రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును విజయవాడలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎస్ఈజెడ్‌లోని కర్మాగారాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నార న్నారు. అందువల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని కోరారు. గంజాయితో పాటు డ్రగ్స్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

మునగపాక : విజయవాడలో కనకదుర్గమ్మను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి జనార్ధనరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెంలో జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న సుజాత తదితరులు

పరవాడ, జూలై 26 : ముత్యాలమ్మపాలెంలో శుక్రవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సర్పంచ్ చింతకాయల సుజాత ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మండల కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, సూరాడ ముత్యాలరావు, మైలపల్లి బంగార్రాజు, కొవిరి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట, జూలై 26 : సత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక బృందావనం ఎంపీపీ స్కూల్‌లో సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్‌ఫేర్ సమకూర్చిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావుతో పాటు మాతినాయుడు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ

కొత్తూరు, జూలై 26 : సంపతిపురం పంచాయతీ తమ్మయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి వైసీపీ ఆర్థిక సాయం

ఎలమంచిలి, జూలై 26 : రాంబిల్లి మండలంలో ఇటీవల హత్యకు గురైన తొమ్మిదో తరగతి విద్యారిని కుటుంబానికి వైసీపీ నాయకులు ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర చేతులమీదుగా ఈ సాయం అందించారు. నాయకులు అగ్రెపు గుప్తా, కొల్లి త్రినాథ్, పిల్లా త్రినాథ్, రాపేటి సంతోష్, లక్ష్మణ్, దూది నరసింహమూర్తి, రాంబిల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక (తుమ్మపాల), జూలై 26 : వాహనాల డ్రైవర్లు తప్పక ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ ప్రసాదరావు సూచించారు. శుక్రవారం గణపర్తి గ్రామంలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుకు గురైన మహిళ మృతి

రాంబిల్లి, జూలై 26 : మండలంలోని పెదకలవలాపల్లి గ్రామానికి చెందిన కలవలాపల్లి రమణమ్మ(60)పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుత మృతి చెందినట్టు సీఐ నరసింగరావు తెలిపారు. రమణమ్మ ఈ నెల పదో తేదీ ఉదయం ఇంటి పక్కన ఉన్న తోటలో బహిర్భూమికి వెళుతుండగా పాము కాటుకు గురైందన్నారు. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, వైద్య సేవలు పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు చెప్పారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

1న ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ : ఎంపీడీవో



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, జూలై 26 : వచ్చే నెల 1న అన్ని గ్రామాల్లోను ఉదయం 5.30 గంటలకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించాల ని ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆదేశించారు. ఆగస్టులో పింఛన్ల పంపిణీపై సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో శుక్రవారం మధ్యాహ్నం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రంలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.

కె.కోటపాడులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేస్తున్న జనసేన పార్టీ నేతలు

కె.కోటపాడు, జూలై 26 : మండల కేంద్రంలో జనసేన నాయకుడు గోపి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 32 గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నట్టు తెలిపారు. ఏ పార్టీలో లేని విధంగా క్రియాశీలక సభ్యులకు రూ.ఐదు లక్షల బీమా,రూ.50 వేల మెడిసిన్ బీమాను తమ పార్టీ అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జనసేన మండల గౌరవాధ్యక్షుడు చుక్కా నారాయణమూర్తి, నాయకులు చింతల శ్రీను, వేగి ప్రకాష్, బొడ్డు శ్రీను, భూపతి గణేష్, భూపతి సంతోష్, భూపతి బాలకృష్ణ, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో అవకతవకలు

» పోలీసులకు కూటమి నేతల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాద చేస్తున్న కూటమి నేతలు

కృష్ణాదేవిపేట, జూలై 26 : గొలుగొండ మండలం సీహెచ్ నాగాపురం రామాలయ నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణచేపట్టాలని కోరుతూ ఎస్ఐ ఉపేంద్రకు శుక్రవారం కొందరు గ్రామస్థులు, కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి దాతలు, టీడీటీ నిధులు రూ.11.5 లక్షల వరకూ వసూలయ్యాయని పేర్కొన్నారు. అయితే ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించిన లెక్కలను సర్పంచ్ యలమంచిలి రఘురామ్ చంద్రరావు చెప్పడం లేదని ఫిర్యాదు చేశారు. ఆలయ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై స్పందనలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు కూటమి నేతలు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, జనసేన మండల సీనియర్ నాయకుడు రేగుబల్ల సాంబశివ, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, వరహాల బాబు తదితరులు కోరారు.

జోగంపేట హాస్టల్ అదనపు గదులకు ప్రతిపాదనలు



రికార్డులు పరిశీలిస్తున్న శ్యామల

గొలుగొండ, జూలై 26 : మండలంలోని జోగంపేట ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం ఏఎస్‌డబ్ల్యూ ఎం.శ్యామల పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.నర్సీపట్నం సెక్టారులోని ఆరు మండలాల్లో 12 ఎస్సీ హాస్టళ్లలో ప్రస్తుతం తొమ్మిది వందలకు పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ ఏడాది ప్రవేశాలు కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ తప్పక అమలు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. జోగంపేట హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య 95 కాగా ప్రస్తుతం వసతి గదులు సరిపడక పోవడంతో 35 మంది హాస్టల్‌కు రావడం లేదన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్టు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పాత హాస్టల్ భవనం మరమ్మతులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ గోవింద పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

గొలుగొండ, జూలై 26 : మండలంలోని శుక్రవారం నిర్వహించిన పప్పుశెట్టిగ్రామ పంచాయతీ గ్రామ సభలో ప్రజలు గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆరోపించారు. 2023-24 వార్షికానికి 15వ ఆర్థిక సంఘ నిధులతో ఏ అభివృద్ధి పనులు చేపట్టారో వివరించాలని గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మిని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సాగుదారులకు మంజూరు చేసిన పట్టాల మంజూరులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రఘురాం, మాజీ సర్పంచ్‌లు గొడ్డేటి రాజబాబు, నాయకులు బెల్లపు కొండలరావు, దట్టం వెంకటరమణ, పొట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



అవగాహన కల్పిస్తున్న డా.నూకేశ్వరరావు

రోలుగుంట, జూలై 26 : అధిక పాల దిగుబడిని మేలైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు పేర్కొన్నారు. రోలుగుంటలో శుక్రవారం పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 75 శాతం రాయితీపై సీఎస్ 24 రకం జొన్న విత్తనాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా మెలగండి

» ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో కాశీవిశ్వేరరావు

బుచ్చెయ్యపేట, జూలై 26 : సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎంఈవో బి.కాశీవిశ్వేశ్వరరావు సూచించారు. శుక్రవారం శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా దిబ్బిడి జడ్పీ హైస్కూలులో సాంకేతిక విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చెడు అలవాట్లు, మొబైల్ ఫోన్లకు బానిస కావొద్దన్నారు. చదువు ద్వారా మాత్రమే ఉన్నత స్థానానికి చేరుకోగలమన్నారు. విద్యార్థులకు గోల్ సెట్టింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యారావు, ఉపాధ్యాయులు డివిజే అప్పారావు, ఒమ్మి అప్పారావు, వెంకటేష్ ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు, సీఆర్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓలమ్మో.. 'వాలాబు' దారి!

» నిండా గోతులతో భయంకరంగా తయారైన రహదారి

» వెళ్లాలంటేనే వణుకుతున్న గిరిజనులు

దేవరాపల్లి, జూలై 26 : దేవరాపల్లి-వాలాబు రోడ్డు అధ్వానంగా తయారైంది. దేవరాపల్లికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రోడ్డు గోతులమయంగా మారింది. శంభువానిపాలేనికి వెళ్లే రహదారి వద్ద, పెద గంగవరం రామాలయం దరి, విప్పగరువు సమీపంలో రోడ్డు పాడవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి 13 శివారు గ్రామాలతో పాటు అనంతగిరి మండలానికి చెందిన నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు దేవరాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు సరిగా లేకపోవడంతో గిరిజనుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ గ్రామాల ప్రజలు తారు రోడ్డు వద్దకు రావాలంటే సుమారు రెండు, మూడు కిలోమీటర్లు రావాల్సి ఉంటుంది. వర్షం వస్తే



పాత వాలాబు-కేటీ పాలెం మట్టి రోడ్డు



మడుగులమయంగా మారిన పెదగంగవరం వద్ద మట్టి రోడ్డు

వీరు ఇక్కట్లు పడాల్సిందే. ఈ రహదారి సరిగా ఉంటే చీడికాడ మండలం కోణాం, పాడేరు వెళ్లేందుకు



కేటీ పాలెం వద్ద దిగబడిన ఆటోను తోస్తున్న ప్రయాణికులు

సులభంగా ఉండి సుమారు 30 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

దారంతా గోతులు, బురద

మాకవరపాలెం : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటికే గిడుతూరు, జి.వెంకటాపురం, రామన్నపాలెం, ఫైనీయర్ కంపెనీకి వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగించే జి.వెంకటాపురం రోడ్డు బురదమయంగా తయారైంది. రాత్రి సమయాల్లో ఈ రోడ్లపై ప్రయాణం ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.





కార్గిల్ విజయం స్ఫూర్తిదాయకం

» యుద్ధం జరిగి 25 ఏళ్లయిన సందర్భంగా పలు చోట్ల విజయ్ దివస్



నర్సీపట్నం : విజయోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



మాడుగులలో విజయోత్సవ సభ

నర్సీపట్నం, జూలై 26 : కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్టీఆర్ మిని స్టేడియంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో హెచ్‌వీ జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులకు కార్గిల్ విజయం గొప్ప స్ఫూర్తిదాయకం అన్నారు. భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలు చేబూని ర్యాలీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌చార్జ్ సీవ హరి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి ఓలేటి శ్రీనివాసరావు, వెలగా జగన్నాథ్ పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగులలోని సేవాభారత్ కార్యాలయం వద్ద గ్రామానికి చెందిన పలువురు పెద్దలు శుక్రవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ యుద్ధంలో వీర జవాన్లకు నివాళులు అర్పించారు. అనంతరం కార్గిల్ యుద్ధ సమయంలో సైనికదళంలో ఉన్న ప్రస్తుత మాడుగుల జిల్లా పరిషత్‌బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అచ్చిన జగన్నాథరావు, వడ్డాది సందీప్‌వర్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, బీజేపీ నాయకులు పుట్టా గంగయ్య, మండల సంతోష్‌సుబ్బలక్ష్మి, దేవరపల్లి శ్రీను, కొండలరావు మాష్టారు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సైనిక త్యాగాల గురించి వివరించారు. భరతమాత చిత్రపటం, జాతీయజెండాలు ప్రదర్శించారు. ప్రతి విద్యార్థి దేశం పట్ల ఆరాధన భావాన్ని కలిగి ఉండాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోసూరు రాము, లోవరాజు, సంతోషి, నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : సైనికులంటే స్వార్థం ఎరుగని దేశభక్తులని, వీర సైనికుల త్యాగాలు మరువలేనివని కూటమి నాయకులు కొనియాడారు. శుక్రవారం వడ్డాదిలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు జాతీయ జెండాలను చేతబూని స్థానిక చెరకు కాటా నుంచి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దూది రాజేష్, కె.రామూర్తి, శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర, దొండా సాయి, ఆది రమేష్, గంట్రెడ్డి వెంకటేష్, బొబ్బాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో..

జాజులపాలెంలో కొనసాగుతున్న వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చీడికాడ, జూలై 26 : మండలంలో కోనాం శివారు గిరిజన గ్రామం జాజులపాలెంలో రెండో రోజూ వైద్య శిబిరం నిర్వహించారు. 'జ్వరంతో గిరిజన బాలుడు మృతి'పై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు స్పందించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గ్రామంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఇద్దరికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి కె.రమేష్‌బాబు, సీహెచ్‌వో ప్రతాప్, హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్‌లు పెంటకోట పేరునాయుడు, చినబాబు, హెచ్‌వీ భవానీ, ఏఎన్ఎం రాజేశ్వరీ ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి అటవీప్రాంతంలో నివాసం ఉంటున్న వారంతా వర్షాకాలం పూర్తయ్యే వరకూ ప్రతిరోజు తప్పకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ దోమతెరలు వాడాలన్నారు. ఏ వ్యాధిసోకినా ప్రభుత్వ ఆస్పత్రికి రోగిని తరలించాలన్నారు.

మాడుగుల తహసీల్దార్ బదిలీ

మాడుగుల, జూలై 26 : మాడుగుల తహసీల్దార్‌గా పని చేస్తున్న పి.సత్యనారాయణను బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మాడుగుల తహసీల్దార్‌గా వచ్చిన ఆయనను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టరేట్‌లో రిపోర్టు చేసినట్టు అధికారులు తెలిపారు. ఆయన స్థానంలో మాడుగులలో ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలు చేపట్టారు.

పారిశుధ్యంపై చర్యలు



పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బంది

కృష్ణాదేవిపేట, జూలై 26 : గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో శుక్రవారం పలు వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, సిబ్బంది కూటమి నాయకులు దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు.చెత్తకుప్పల తొలగింపు, కాలువల్లో పూడికలు తీసి బ్లీచింగ్ చల్లారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సహదేవుడు, టీడీపీ నాయకులుమువ్వల వరహాలబాబు, రమణ, ప్రసాదు, చిన్ని పాల్గొన్నారు.

బురదమయంగా తాచేరు డైవర్షన్ రోడ్డు

» కూరుకుపోతున్న వాహనాలు



డైవర్షన్ రోడ్డులో కూరుకుపోయిన స్కూలు బస్సు

బుచ్చెయ్యపేట, జూలై 26: భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో తాచేరు డైవర్షన్ రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలు కూరుకుపోతున్నాయి. ఈ నెల 20న దెబ్బతిన్న కాజ్‌వేకు మరమ్మతు చేపట్టిన ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు మట్టి, రాళ్లువేసి నిలిచిపోయిన రవాణాను ఈ నెల 25న పునరుద్ధరించారు. అయితే ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో డైవర్షన్ రోడ్డు మొత్తం మళ్లీ బురదమయంగా మారింది. దీంతో వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. డైవర్షన్ రోడ్డుపై వెట్ మిక్స్ వేసి పటిష్ట పరచాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

నర్సీపట్నం, జూలై 26 : ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో తలుపులు పాల్గొని విద్యార్థులకు డిజిటల్ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రత్నం ఆధ్వర్యంలో సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజగోపాల్ తొమ్మిదో తరగతి విద్యార్థులకు క్యూర్ కోడ్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, రెడియాలసీ, సెల్ ఫోన్, నానో టెక్నాలజీ గురించి వివరించారు.

మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు ప్రారంభం

చీడికాడ, జూలై 26 : మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు రెండు రోజులుగా వరినాట్లు వేయడం ప్రారంభించారు.పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు, చెరువుల్లో పుష్కలంగా నీరు చేరడంతో మెట్ట ప్రాంతాలైన కోణాం, మంచాల, శిరిజాంతో పాటు చీడికాడ, ఖండివరం తదితర గ్రామాల్లో వరినాట్లు వేసేపనిలో రైతులు బిజీగా ఉన్నారు. ఈసారి వర్షాలు ఆశాజనకంగా వర్షాలు పడుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతులు

శిక్షా సప్తాహ్‌లో డిజిటల్ ప్రదర్శన

మాకవరపాలెం, జూలై 26 : డిజిటల్ బోధన ద్వారా పిల్లల్లో సృజనాత్మకల పెంపొందుతుందని ఎంఈవో-1 జాన్ ప్రసాద్ అన్నారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం పలు పాఠశాలల్లో డిజిటల్ బోధనకు సంబంధించిన పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఐఎఫ్‌పీ ప్యానెల్, స్మార్ట్ టీవీలు ఉపయోగించి పాఠాలను బోధించే విధానంపై సూచనలు అందించారు.

దీక్ష యాప్, ఈ జాదు పిటారా యాప్, పాఠశాల వంటి యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, మాకవరపాలెం హైస్కూల్ హెచ్ఎం అచ్యుత్‌రామయ్య పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

దేవరాపల్లి, జూలై 26 : వర్షాల కారణంగా ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి టి.లక్ష్మి కోరారు. శుక్రవారం రైవాడలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయ, వాటి వల్ల మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతాయని అవగాహన కలిగించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. గ్రామసభలో చల్లా నానాజీ, తాతయ్యలు, నాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పరాయి పంచనే!

... 5వ పేజీ తరువాయి

గదిలో 12వ వార్డు సచివాలయం,మెప్మా కార్యాలయంలో 15వ వార్డు సచివాలయం, శారదానగర్ అద్దె ఇంట్లో 16వ వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. బలిఘట్టం పాత పంచాయతీ భవనంలో 17, 18 వార్డు సచివాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా 19, 20వ వార్డు సచివాయం పాత బయపురెడ్డిపాలెంలోని అద్దె ఇంట్లో ఏర్పాటు చేశారు. 21వ వార్డు సచివాలయం శారదానగర్‌లోని అద్దె ఇంట్లో నడుస్తోంది. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారుల కోసం నిర్మించిన భవనంలో 22, 23 వార్డు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం పాత మునిసిపల్ కార్యాలయంలో 24, 25, 26, 27 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఏరియా ఆస్పత్రి ఎదురుగా మహిళా మండలి భవనంలో 28వ వార్డు అయ్యన్నకాలనీ సచివాలయం ఏర్పాటు చేశారు. ప్రైవేటు భవనాలలో సచివాలయాలు నిర్వహించడంతో ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. అంతేకాదు ప్రజావసరాలకు సరిపడా భవనాలు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇక్కట్ల మధ్య విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఉన్న పది మంది ఉద్యోగులు ఒకే గదిలో పనిచేయాల్సి వస్తోంది. ప్రతి వార్డులో మునిసిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాలు ఉన్నప్పటికి ప్రభుత్వం భవనాలను నిర్మించడం లేదు. దీంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

నేషనల్ వూషూ టోర్నీకి నర్సీపట్నం బాక్సర్లు

నర్సీపట్నం, జూలై 26 : నేషనల్ వూషూ టోర్నమెంట్‌కి నర్సీపట్నం అకాడెమీకి చెందిన ఇద్దరు బాక్సింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల వూషూ అసోసియేషన్ నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ యూత్ వూషూ టోర్నమెంట్‌లో నింజాస్ అకాడెమీ క్రీడాకారులు విత్తనాల లోకేశ్, రైతు నాగలక్ష్మి స్వర్ణ పతకాలు సాధించి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. శనివారం కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి వూషూ పోటీలలో వీరు పాల్గొంటారని కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వెలగా నారాయణరావు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చోడవరం, జూలై 26 : వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పంచాయతీ ఈవో నారాయణరావు కోరారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించి పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై అవగాహన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ కార్యాలయ సిబ్బంది

రోలుగుంట, జూలై 26 : రోలుగుంట తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ రవిచంద్రను శుక్రవారం కార్యాలయం సిబ్బంది సన్మానించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు విజయనగరం జిల్లా నుంచి బదిలీపై రోలుగుంటకు వచ్చారు. నాలుగు నెలల పాటు సమర్థవంతంగా విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో తోటి ఉద్యోగులు కలిసి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వివిధ గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంను వీడని ముసురు



నర్సీపట్నంలో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం, జూలై 26 : నర్సీపట్నంలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి 9 గంటలు వరకు తేలికపాటి వర్షం కురిసింది. గత వారం రోజులు ఉదయం ముసురు పట్టుకొని గంట రెండు గంటలు తర్వాత తెరిపిస్తుంది. దీంతో మునిసిపాలిటీ శివారు ప్రాంతాలలోని మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి.

యాదవ విద్యార్థులకు ఉపకార వేతనాలు

బుచ్చెయ్యపేట, జూలై 26 : పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు జిల్లా యాదవ సంక్షేమ సంఘం స్కాలర్ షిప్‌లు అందచేయనున్నదని మండల యాదవ సంక్షేమ సంఘాధ్యక్షుడు సింగంపల్లి రమేష్ తెలిపారు. పదో తరగతిలో 550 మార్కులు, ఇంటర్మీడియేట్‌లు 900 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు మండల యాదవ సంక్షేమ సంఘానికి ఈ నెల 28లోగా దరఖాస్తులు అందజేయాలని రమేష్ కోరారు.

సీహెచ్ గదబూరు పాఠశాల పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్ వ్యక్తిగత సహాయకుడు

మాడుగుల రూరల్, జూలై 26 : మండలంలోని చింతలూరు గదబూరు మండల పరిషత్ పాఠశాలను శుక్రవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదేశానుసారం అతని వ్యక్తిగత సహాయకుడు విజయ్ స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులు మేరకు వాటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

దేవరాపల్లి, జూలై 26 : మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్లు, విద్య, వైద్యం, తాగు నీటి వసతులు వంటివిగత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ఆగస్టు 6న నర్సీపట్నంలో జరగనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో రెడ్డిపల్లి అప్పలరాజు, వేమల కన్నబాబు, గరికిన రాజు, సింహాద్రి, దేవా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

చీడికాడ, జూలై 26 : ఆధార్ సేవా కేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరీపట్నపు నానాజీలు కోరారు. శుక్రవారం ఉదయం దిబ్బపాలెంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.